పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

# చెన్నకేశవుని రథోత్సవంలో ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 12**

చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్కాపురంలో శ్రీదేవి భూదేవి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి రథోత్సవం పట్టణం లోని నాలుగు మాడవీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచారు. గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి చెన్నకేశవ స్వామిని దర్శించుకొని ప్రత్యక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవంలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అశోక్ రెడ్డికి ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు.వేద పండితులు వేదాశీస్సుల అందజేశారు. అశోకరెడ్డి రథం లాగి స్వామి సేవలో పాల్గొన్నారు.

# హాస్టల్ వార్డెన్‌లకు ఎమ్మెల్యే ఇంటూరి మాస్ వార్నింగ్

- ఇదే లాస్ట్ వార్నింగ్ ఈసారి యాక్షన్ తప్పదు
- ప్రభుత్వ హాస్టల్స్ లో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీలు
- మెనూ పాటించకపోవడంపై సీరియస్
- హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాల్సిందే
- వార్డెన్లు విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉండాల్సిందే
- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు







**కందుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 12**

ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్ లో సమస్యలు, సిబ్బంది పనితీరుపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆకస్మిక తనిఖీలు మొదలుపెట్టారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా, వారికి అన్ని సౌకర్యాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం కందుకూరు పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్, పక్కనే ఉన్న టి ఆర్ ఆర్ కళాశాల బాలికల హాస్టళ్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. తనిఖీ సమయంలో రెండుచోట్ల వార్డెన్లు విధుల్లో లేకపోవడంపై ఎమ్మెల్యే సీరియస్ అయ్యారు. సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ లో అపరిశుభ్ర వాతావరణాన్ని గమనించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు పరిసరాలు ఇలా ఉంటే విద్యార్థులకు జబ్బులు రావా అని వార్డెన్ ను నిలదీశారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. మెనూ ప్రకారం తమకు ఆహారం పెట్టడం లేదని విద్యార్థులు ఎమ్మెల్యేకి చెప్పారు. ప్రస్తుతం ఉన్న రూములు సరిపోవటం లేదని, చిన్న రూముల్లో 8 మంది ఉండాల్సి వస్తోందని అన్నారు. ప్రభుత్వం అందించిన వాటర్ కూలర్ ను వెంటనే బిగించి అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే సూచించారు. తర్వాత టిఆర్ఆర్ కాలేజీ ఆవరణలో బాలికల హాస్టల్ ను కూడా నాగేశ్వరరావు తనిఖీ చేశారు. అక్కడ కూడా మెనూ పాటించడం లేదని విద్యార్థులు ఎమ్మెల్యేకి చెప్పారు. ఆదివారం ఉదయం మెనూ ప్రకారం అల్పాహారంలో గుడ్డు ఇవ్వలేదని, కూరలు చాలినంత పెట్టడం లేదని ఫిర్యాదు చేశారు. హాస్టల్ లో పరిస్థితులను గమనించాక, వార్డెన్లపై ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిరోజుల క్రితం ఇదే హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి, పద్ధతి మార్చుకోవాలని సూచించినప్పటికీ మీలో మార్పు రాలేదని అసహనం చెందారు. అక్కడినుంచే జిల్లా అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ఎక్కువమంది విద్యార్థినులు హాస్టల్ లో ఉంటున్నట్లు అటెండెన్స్ ఎందుకు వేశారని వార్డెన్లను ప్రశ్నించారు. ఇదే లాస్ట్ వార్నింగ్. ఈసారి క్షమించడం ఉండదు యాక్షన్ తప్పదు అని ఎమ్మెల్యే వారిని గట్టిగా మందలించారు.

## ధ్వజ స్తంభం ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే ముత్తుముల





**గిద్దలూరు పెన్‌పవర్ ఏప్రిల్ 12**

గిద్దలూరు పట్టణంలోని కొంగళవీడు రోడ్డులో నిర్వహించిన శ్రీ ఈశ్వరమ్మ ధ్వజ స్తంభ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. భక్తులతో ఆత్మీయంగా మమేకమై ఆశీర్వాదాలు అందుకున్నారు. అనంతరం స్థానిక నాయకులు ఎమ్మెల్యే ను శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బిల్లా రమేష్ పట్టణ కౌన్సిలర్ లు వార్డు నాయకులు తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# హాస్టళ్ల దత్తత అధికారులు ఎక్కడ??

## హాస్టల్స్ తనికీకి వెళ్తున్నారా??
## వార్డెన్ చూపిన సమాచార ప్రామాణికమా??




**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 12**

సాంఘీక సంక్షేమ , బిసి సంక్షేమ హాస్టళ్లకు నియమించిన దత్తత అధికారుల అడ్రస్ లేకరువయ్యాయి. ప్రభుత్వం ఎస్సి , ఎస్టి బిసి వసతి గృహాల్లో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రతి హాస్టల్ కు ఒక దత్తత అధికారిని, వారి పై మరొఅధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ దత్తత అధికారులు ఉత్తర్వులు అందుకున్న ఒక్క రోజు హాస్టళ్ల కు వెళ్లివచ్చారు. అదికూడా వసతి గృహ సంక్షేమాధికారికి సమాచారం ఇచ్చి వెళ్ళటం తో అన్ని సర్దుబాటు చేసుకొని , (పిల్లలతో సహా) హాస్టలకు రమ్మంటే వెళ్లారు. ఆతరువాత దత్తతా అధికారులు హాస్టల్స్ కు వెళ్ళటం మానేసినట్లు సమాచారం. వారు హాస్టల్స్ కు వెళ్లటమే లేదు కారణం తెలియటం లేదు, ప్రభుత్వం దత్తత అధికారుల నియామక ఉత్తర్వులను ఉపసంహరణ చేసిందా తెలియదు. లేదా వసతి గృహసంక్షేమాధికారులను హాస్టల్ లో పిల్లల హాజరు, మెనూ సమాచారం తెలుసుకొని వారిచ్చిన సమాచారం లో రిపోర్టు తయారుచేసి చెక్డ్ ఫౌండ్ కరెక్ట్ నివేదికలు పంపుతున్నట్లు గా తెలుస్తుంది. దీంతో వసతిగృహ సంక్షేమాధికారులు ఆడింది ఆటగా మారింది. గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలో హాస్టళ్లలో పిల్లలు నిల్, హాజరు ఫుల్,గా ఉంది. ఏ అధికారి అయిన హాస్టల్ సందర్శనకు వస్తానని ముందస్తు సమాచారం ఇచ్చి వెళ్తారు దాంతో హాస్టల్ లో అన్నిసర్దుబాటు చేసుకొని ఆ అధికారిని పిలవడం ఆనవాయితీగా మారింది. ఇది ఇలాఉండగా ఒక్కో వసతిగృహ సంక్షేమాధికారికి మూడు హాస్టళ్లు ఇన్ఛార్జిలుగా వ్యవహరిస్తున్నారు . దీంతో ఆ వసతిగృహ సంక్షేమాధికారి ఏ హాస్టల్లో ఉంటాడో తెలియని పరిస్థితి. ఫలితంగా ఎక్కడ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలు జరగడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. కాకుండా వారానికి ఒక్కసారైనా ఇంచార్జి ఉన్న హాస్టల్ కు వెళ్లరనే విమర్శలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు వసతి గృహ సంక్షేమాధికారుల కు ఇంచార్జి బాధ్యతలు తగ్గించి వసతి గృహాల్లో ఉండే బోర్డర్స్ కు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలు అయ్యేలాచూడాలని పిల్లల తాళి దండ్రులు కోరుతున్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు (ముఖ ఆధారిత) పాఠశాల ఆవరణలోనే సెల్ తీసుకుంటుంది , కానీ హాస్టల్స్ లో హైస్కూల్ లోనైనా , గ్రామంలో పిల్లల ఇండ్లవద్ద నైనా సెల్ లో హాజరు పడటం ఆశ్చర్యం కలిగిస్తుంది విమర్శ ఉంది.

# భైరవకోనలో ఘనంగా ధార్మిక సదస్సు

## భక్తుల సమస్యలపై అధికారులు సానుకూల స్పందన
## ఆలయ అభివృద్ధిపై కీలక నిర్ణయాలు



**సిఎస్‌పురం, పెన్ పవర్ ఏప్రిల్ 12**

జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ పుణ్యక్షేత్రం భైరవకోన భైరవేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన ధార్మిక సదస్సు విశేషంగా సాగింది. ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తి భావంతో పాటు ఆలయ అభివృద్ధికి దిశానిర్దేశం చేసే వేదికగా నిలిచింది. కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఉదయం భైరవకోనకు చేరుకుని హెచ్డిపిటీ చైర్మన్ ను కలుసుకున్నారు. ఆలయానికి మరింత సౌకర్యాలు కల్పించడం, పర్యాటక అభివృద్ధి చర్యలు చేపట్టడం వంటి అంశాలపై ఆయన విస్తృతంగా చర్చించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.తరువాత జరిగిన ధార్మిక సదస్సులో కనిగిరి ఆర్డీవో శివరామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వంశీకృష్ణారెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు, హెచ్డిపిటి ప్రతినిధులు, భక్తులు పాల్గొని ఆలయ నిర్వహణ, భక్తులకు అవసరమైన సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. సదస్సులో ముఖ్యంగా భక్తుల నుంచి వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మార్కాపురం నుండి భైరవకోనకు ప్రత్యక్ష బస్సు సౌకర్యం లేకపోవడంతో భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. దీనిపై స్పందించిన ఆర్డీవో త్వరలోనే బస్సు సర్వీసులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు అదే విధంగా దేవాలయంలో నిరుపేదలకు సామూహిక వివాహాలు నిర్వహించడం, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు క్రమబద్ధంగా చేపట్టడం వంటి సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో ఆదరణకు నోచుకోని దేవాలయాలను గుర్తించి భక్తుల సహకారంతో దీపం వెలిగింపు కార్యక్రమాన్ని హెచ్డిపిటి ద్వారా ప్రారంభించనున్నట్లు తెలిపారు ఆలయ పవిత్రతను కాపాడే దిశగా ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు సాధారణ భక్తులకు ఇబ్బందులు కలిగించే విఐపి సంస్కృతి తగ్గించి అందరికీ దర్శన సౌకర్యం కల్పిస్తూ ఆలయ నియమ నిబంధనలను పాటించాలని నిర్ణయించారు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఆలయ ప్రాంగణంలో దేవత వృక్షాలను నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని, భైరవకోనను ఆధ్యాత్మిక పర్యటక కేంద్రముగా మరింత అభివృద్ధి చేయాలని తీర్మానించారు ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ చైర్మన్ విశ్రాంత ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు, కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కనిగిరి ఆర్డీవో శివరామి రెడ్డి, హైందవ సనాతన సంఘ్ మరియు సంత్ పరిషత్ జాతీయ అధ్యక్షులు త్రిపుర భైరవేశ్వర నంద స్వామీజీ, జాతీయ బ్రాహ్మణ యువజన కార్యదర్శి సంగరాజు సాయి మనోజ్, ట్రస్ట్ బోర్డు సభ్యులు ముద్దులూరు వెంకట్ రాజు, మాజీ సర్పంచ్ ముప్పాళ్ళ శ్యామల నారాయణరాజు, ముప్పాళ్ళ విక్రం రాజు, కారుమంచి శేష సాయి తేజ, వాలి చర్ల అంబరీష్, వాలిసర్ల సూర్యనారాయణ, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.



# రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలి

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 12**

రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రైతులు ఉద్యమాలకు సిద్ధం కావాలని రైతు సంఘం నాయకులు కోరారు. అఖిల భారత కిసాన్ సభ 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని నల్లమడుగుల, అరివేముల, ఉప్పలపాడు, ముండ్లపాడు, పెద గోగులపల్లి, రేగులచెలక గ్రామాలలో జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ 1936 ఏప్రిల్ 11 న ఏర్పడిన అఖిలభారత కిసాన్ సభ దేశ స్వాతంత్రం కోసం, ప్రజలను పీడిస్తున్న జమీందారీ విధానం రద్దు చేయడం కోసం, వడ్డీ వ్యాపారుల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టినట్లు తెలిపారు. వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం ఊహించి జమీందారీ విధానాల రద్దుకు కృషి చేసినట్లు చెప్పారు. స్వాతంత్రం అనంతరం సాగునీటి ప్రాజెక్టుల కోసం, బంజరు భూముల పంపకం కోసం, మార్కెట్ దోపిడీలకు వ్యతిరేకంగా పంటల మద్దతు ధరల కోసం దేశవ్యాప్తంగా ఉవ్వెత్తున పోరాటాలు సాగించినట్లు తెలిపారు. 1990 లో ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన వ్యవసాయ విధానాన్ని ప్రతిగటించి సాగించిన పోరాటాలు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ ఏర్పాటుకు దారి తీసినట్లు చెప్పారు. 2024 లో మరోసారి అధికారం లోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం అమెరికా, ఐరోపా యూనియన్ లతో చేసుకున్న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లు అమలులోకి వస్తే మన వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకు పోతుందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఈ అగ్రిమెంట్లు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు అండగా ఉన్న గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ జిరాంజీ అనే నూతన చట్టాన్ని తీసుకువచ్చినట్లు చెప్పారు. పై చట్టాల రద్దు కోసం, వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, మధ్యతరగతి రైతుల రుణాల రద్దు కోసం ఉపాధి హామీ పథకం పునరుద్ధరణ కోసం, నాలుగు కార్మికుల కోడ్లు రద్దు చేయాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా ట్రేడ్ యూనియన్ల జాయింట్ యాక్షన్ కమిటీలు పోరాటాలకు సిద్ధం అవుతున్నట్లు చెప్పారు. ఈ పోరాటాలకు రైతాంగం సిద్ధం కావాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో అజీజ్ బాషా, గురవయ్య, నరసారెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# నారాయణస్వామికి ఆదివారం విశేష పూజలు





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 12**

జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రంగా పేరొందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో స్వామివారికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారి మూల విరాట్ ను వివిధ రకాల పూలమాలలతో అలంకరించి పంచామృత అభిషేక పూజలు నిర్వహించారు స్వామివారి మూలవిరాట్, శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో పూలమాలలతో అలంకరించారు అనంతరం గోపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. గోశాల వద్ద గోవును పవిత్రంగా అలంకరించి వేదమంత్రాలతో పూజలు చేసిన తదుపరి దేవస్థానం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు నిర్వహించి స్వామివారికి మహా నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు అనంతరం రాత్రి కి ఆలయ ఆవరణలో పల్లకి సేవ నిర్వహించారు ఈ కార్యక్రమాలలో ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పి ఆర్సీ కమీషన్ వేయాలని, డీఏలు ప్రకటించాలని ఎమ్మెల్యే ముత్తుములకు వినతిపత్రం



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 12**

రాష్ట్ర శాఖ పిలుపుమేరకు విశ్రాంత ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు జి రవీంద్రనాధ రెడ్డి ఆధ్వర్యంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కి విశ్రాంత ఉద్యోగుల ,ఉద్యోగుల డిమాండ్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లాలని వినతి పత్రము సమర్పించి తగిన సిఫారసులు చేయాలంటూ కోరారు .అదనపు పెన్షన్ 10, 15 శాతం ఇవ్వాలని, పిఆర్సి కమిషన్ వేయాలని, ఐఆర్ ప్రకటించాలని, డి.యర్ .బకాయిలు చెల్లించాలని ముఖ్యమంత్రి కి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి స్పందించి ఈ వినతి పత్రాన్ని ముఖ్యమంత్రి కి పంపించి తగిన చర్యలు గైకొనవలసిందిగా కోరగలనని హామఇచ్చారు.

# జిల్లా జడ్జి విజయ సారధిరాజుకు అభినందనలు



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 12**

యర్రగొండపాలెం నివాసి విజయ సారధి రాజు తిరుపతి జిల్లా జడ్జిగా పదోన్నతి పొందడంపై పట్టణ యస్ యం డి బ్రదర్స్ ఆధ్వర్యంలో యూత్ కేక్ కట్ చేసి ఆయనకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు యర్రగొండపాలెం పట్టణంలో ఇంటర్ మీడియట్ వరకు చదివిన ఆయన ఉన్నత విధ్యలు పూర్తి చేసి 2008లొ న్యాయ వ్యవస్థలో చేరారని, ఆంధ్రప్రదేశ్ లోని పలు చోట్ల మేజిస్ట్రేట్ గా విధులు నిర్వహించి ఇటీవల తిరుపతి జిల్లా మేజిస్ట్రేట్ గా పదోన్నతి పొందడం యర్రగొండపాలెం పట్టణానికి గర్వ కారణమని అన్నారు. యువత విజయ సారధి రాజును ఆదర్శంగాతీసుకుని విద్యలో రాణించాలని తల్లి దండ్రులకు, స్వంత ఊరికి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల మాజీ విద్యా కమిటీ చైర్మన్ షేక్ మహబూబ్ బీ, న్యాయవాది టీ,త్రివేణి,ఉపాధ్యాయులు అంజలి కుమారి, సుబ్బారావు, మహమ్మద్ ఖాసీం,షేక్ ఇస్మాయిల్,ఆకుల రమేష్,సయ్యద్ ఉస్మాన్,షేక్ అబ్దుల్లా, అఖిల్, షేక్ యాసీన్,మన్సూర్,చాంద్, లాలు,తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# పొదిలిలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన





**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 12**

పొదిలిలో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక విశ్వనాధపురం లోని గీతాంజలి స్కూల్ ఆవరణలో ఆదివారం నాడు లక్ష్మి బి కే ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన డాక్టర్ల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం ద్వారా సుమారు 1500 మంది దాకా వైద్య సేవలు పొందారు. ప్రస్తుత ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని నిర్వాహకులు అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. చల్లని మజ్జిగ, నీటితోపాటు శిబిరానికి విచ్చేసిన రోగులకు ఉచితంగా భోజన సౌకర్యం కూడా కల్పించారు. లక్ష్మి బి కే ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ చాగం రెడ్డి బ్రహ్మ కొండారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.

# మృతదేహానికి నివాళులర్పించిన అర్పించిన వైసిపి ఇంచార్జ్ దద్దాల



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 12**

మండలంలో ఉప్పలపాడు గ్రామం నకు చెందిన వైయస్సార్ సిపి మైనారిటీ నాయకులు మాజీ ఉప సర్పంచ్ షేక్ నాయబ్ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ స్వర్గస్తులైనారు. విషయం తెలుసుకున్న వెంటనే ఉప్పలపాడులో వారి స్వగృహానికి వెళ్లి షేక్ నాయబ్ రసూల్ మృతదేహానికి పూలమాలతో నివాళులర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ సంతాపాన్ని తెలిపారుఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు పాలుగుళ్ళ మల్లికార్జున రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు భువనగిరి వెంకటయ్య, మితికాల గురవయ్య,దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, కటికల వెంకటరత్నం, బత్తుల దేవరాజు ,మేడిపోయిన అటేలయ్య, షేక్ కన్నయ్య, పాలగుల్ల సూర్యనారాయణ రెడ్డి, పాలగుల్ల రత్నారెడ్డి, యంబడి ప్రవీణ్,బక్క దేవదానం, బక్క జాన్సన్, బక్క భాగ్యరాజ్, షేక్ ఖాజా, జోసెఫ్ , షేక్ షరీఫ్, గంగవరం మస్తాన్, రాజాబాయ్ నాగూర్ వలి, బలసాని యెహోషువ తదితర నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పోలీసుల కార్టన్ సెర్చ్ 25 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 12**



ప్రజల్లో మెరుగైన భద్రత భావం పెంచడం, నేరాలను పూర్తి స్థాయిలో అరికట్టడమే లక్ష్యంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు యర్రగొండపాలెం సీఐ కె అజయ్ కుమార్ తెలిపారు.మార్కాపురం జిల్లా ఇంచార్జ్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు,డిఎస్పి యు నాగరాజు ఆదేశాల మేరకు పట్టణంలోని స్థానిక చెంచు పాముల కాలనీలో ఆదివారం సిఐ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో తెల్లవారు జామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సిబ్బందితో కలిసి కాలనీలో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా సోదాలు చేశారు. గంజాయి, మత్తు పదార్ధాలు,మారణాయుధాలు వంటి వాటిపై ఆరా తీశారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఇళ్లల్లో ఉన్న కత్తులు వంటి మరణాయుధాలు స్వాధీనం చేసుకున్నారు.రోడ్డు నిబంధనలు,సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా సీఐ అజయ్ కుమార్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై,సంఘ విద్రోహు శక్తులు,పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు.అటువంటి వ్యక్తులు పాత జీవితాన్ని విడిచిపెట్టి సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అజ్ఞాత వ్యక్తులు వచ్చి మంత్రాలు, పూజలతో అమాయక ప్రజలకు మాయమాటలు చెబుతూ అక్రమ సంపాదనకు అలవాటు పడి మోసాలకు పాల్పడుతున్న వారి మాటలు నమ్మ వద్దని సూచించారు.ఆన్లైన్ మోసాలు,సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.ప్రైవేటు చీటిపాటల స్కీమ్ లలో చేరి కష్టార్జితాన్ని పోగొట్టుకోవద్దని సూచించారు.ఇటీవల సైబర్ నేరగాళ్లు వాట్సాప్ గ్రూపులకు ఏపీకే లింక్స్ పంపిస్తున్నారని,అటువంటి వాటిని ఓపెన్ చేయడం వల్ల మీ ఖాతాలో నగదు ఖాళీ అవుతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం ఎస్సై దేవ కుమార్,పుల్లలచెరువు ఎస్సై సాంబశివరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దక్షిణ భారతదేశంలో టాప్ 50 ప్రోగ్రెసివ్ స్కూల్స్‌లో స్ప్రింగ్ బోర్డ్ స్కూల్‌కు గొప్ప స్థానం

**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 12**




గిద్దలూరులోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థ స్ప్రింగ్ బోర్డ్ స్కూల్ దక్షిణ భారతదేశంలోని ప్రముఖ విద్యాసంస్థలలో ఒకటిగా గుర్తింపు పొందుతూ, నేషనల్ స్కూల్ అవార్డ్స్ లో టాప్ 50 ప్రోగ్రెసివ్ స్కూల్స్ జాబితాలో స్థానం పొందింది. ఈ గౌరవాన్ని ఆదివారం బెంగళూరు నగరంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మణి చైతన్య ప్రిన్సిపాల్ జాడి స్వేత లు స్వీకరించారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్నప్పటికీ నగర స్థాయి విద్యను అందిస్తూ, ఆధునిక బోధనా విధానాలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించడం ద్వారా స్ప్రింగ్ బోర్డ్ స్కూల్ కు ఈ గుర్తింపును సాధించింది. ఈ సందర్భంగా డైరెక్టర్ మణి చైతన్య మాట్లాడుతూ, ఈ విజయానికి తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సహకారమే కారణమని పేర్కొన్నారు. ఈ అవార్డు మరింత తమ బాధ్యతను పెంచింది. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు విశేష కృషి చేస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ స్వేత మాట్లాడుతూ, విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, విలువలతో కూడిన విద్య, ఆధునిక విద్యా పద్ధతులను అందిస్తూ భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధం చేసే దిశగా పాఠశాల ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. ఈ గౌరవాన్ని పాఠశాల యాజమాన్యం మొత్తం స్ప్రింగ్ బోర్డ్ కుటుంబానికి అంకితం చేస్తూ, మరింత ఉత్తమ విద్యా సేవలను అందించడానికి సంకల్పం చేస్తున్నామన్నారు. దక్షణ భారతం లో స్తానం సంపాదించిన స్ప్రింగ్ బోర్డ్ స్కూల్ యాజమాన్యాన్ని పలువురు అభినందిస్తున్నారు. స్కూల్ కరెస్పాండెంట్ డాక్టర్ జె వి నారాయణ ఏ విషయంలో రాజీ కాకుండా తన మనసులో అనుకున్నది చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించటం డాక్టర్ నైజమని పలువురు ప్రశంశలు గుప్పిస్తున్నారు. ఆయన విజయం వెనుక ఆయన సతీమణి గీతామృతం చేదోడు వాదోడుగా ఉండి పాఠశాల ఉన్నత స్థితికి చేరుకోవటానికి అమీకృషి ఎనలేనిదని అభినందనలు కురిపిస్తున్నారు.

# నేడు అర్ధవీడులో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పర్యటన



**అర్ధవీడు, పెన్ పవర్, ఏప్రిల్ 12**

నేడు అర్ధవీడులో గిద్దలూరు శాసనసభ్యులు మరియు రాష్ట్ర పబ్లిక్ అకౌంట్ కమిటీ సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోమవారం ఉదయం 10గంటల నుండి అర్ధవీడు మండల కేంద్రంలో పర్యటించనున్నట్లు అర్ధవీడు మండల పార్టీ అధ్యక్షులు బండ్లమూడి ఆంజనేయులు యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా పలు ప్రభుత్వ అభివృద్ధి పనులను మరియు ప్రజాహిత కార్యక్రమాలను ఆయన ప్రారంభించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు అర్ధవీడు మండల పరిషత్ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకుంటారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే ఉద్దేశంతో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన " చెత్త రిక్షాలను" ఆయన జెండా ఊపి ప్రారంభిస్తారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన "స్వర్ణ రథం" వాహనాన్ని ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రారంభించనున్నారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల అనంతరం అర్ధవీడు మండల తెలుగుదేశం పార్టీ, నాయకులు, కార్యకర్తలు, మరియు అభిమానులతో సమావేశం కానున్నారు. కావున ఎమ్మెల్యే పర్యటనలో అర్ధవీడు మండల పరిధిలోని టీడీపీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు మరియు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# సిమెంట్ లారీ బోల్తా... తప్పిన పెను ప్రమాదం..!



**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 12**

పుల్లలచెరువు మండలం మురికిమళ్ల గ్రామ సమీపంలోని జాతీయ రహదారి--565పై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికంగా కలకలం రేపింది. గిద్దలూరు వైపు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ అధిక వేగంతో అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి పల్టీలు కొట్టి బోల్తా పడింది.ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు, లారీ వేగం నియంత్రణలో లేకపోవడంతో ఒక్కసారిగా డ్రైవర్ అదుపు కోల్పోయాడు. దీంతో వాహనం రోడ్డును దాటి పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో పడిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ తీవ్ర భయాందోళనకు గురైనప్పటికీ, అదృష్టవశాత్తూ స్వల్ప గాయాలతో బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు.సమాచారం అందుకున్న నేషనల్ హైవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. భారీ క్రేన్ సహాయంతో బోల్తా పడిన లారీని రోడ్డుపక్కకు తరలించారు. దీంతో కొంతసేపు నిలిచిపోయిన వాహన రాకపోకలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయి.అధికారుల ప్రాథమిక విచారణలో, వేగ నియంత్రణ పాటించకపోవడమే ప్రమాదానికి ప్రధాన కారణమని తేలింది. రహదారులపై అధిక వేగం ప్రాణాలకు ముప్పు అని, ముఖ్యంగా భారీ వాహనదారులు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని పోలీసులు హెచ్చరించారు.ఈ ఘటనతో జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని, వేగాన్ని అదుపులో ఉంచడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

